ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025
5
శ్రీకాకుళం



సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని సింహద్వారం కూడలి వద్ద శుక్రవారం ప్రత్యేక హెల్మెట్ డ్రైవ్‌ను నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 38 మందికి అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు ఏకాగ్రత, ఇతర వాహన చోదకుల గమనాలను గమనించాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిరీష, సిఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

- శ్రీకాకుళం నగరంలో వి.జి.కె మూర్తి అంతిమ యాత్ర
- బైక్ ర్యాలీతో పార్థివదేహం ఊరేగింపు
- కడసారి చూపునకు భారీగా తరలివచ్చిన ప్రజలు
- రిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత
- మున్సిపల్ హైస్కూల్‌లో హాల్‌కు వి.జి.కె పేరు : ఎమ్మెల్యే శంకర్



దేహ దాన అంతిమయాత్రలో ర్యాలీగా వస్తున్న నాయకులు, అభిమానులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సిపిఎం సీనియర్ నాయకులు, ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులు వి.జి.కె మూర్తి ఇక లేరన్న వార్త అందరినీ కలచివేసింది. ఆయన్ను కడసారి చూసేందుకు భారీగా జనం తరలివచ్చారు. పార్టీ శ్రేణులు, ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు నగరంలోని కత్తెరవీధిలో గల ఆయన నివాసానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. సంతాప సభలో పాల్గొని వి.జి.కె మూర్తితో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయనతో గడిపిన రోజులను గుర్తు తెచ్చుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం నిర్వహించిన దేహ దాన అంతిమయాత్రలో బైక్ ర్యాలీగా అనుసరించారు. రిమ్స్‌లో ఆయన భౌతికకాయం అప్పగించినంత వరకు అక్కడే ఉండి, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇళ్లకు చేరుకున్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

ఉద్యమాలకు తీరని లోటు

స్థానిక ఉద్యమాలకు వి.జి.కె మూర్తి చేదోడువాదోడుగా ఉండే వారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. నగరంలోని కత్తెరవీధిలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. మూర్తి మరణం జిల్లా ఉద్యమాలతో పాటు స్వేచ్ఛను కోరుకునే వారికి తీరని లోటు అని అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ మాట్లాడుతూ పార్టీ, ప్రజాసంఘాలకు మాత్రమే కాక అందరి మన్ననలనూ పొందిన వ్యక్తి వి.జి.కె మూర్తి అని అన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఇబ్బందులున్నా, వాటిని ధైర్యంగా ఎదుర్కొని నిలబడి ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యమయ్యారని కొనియాడారు.

కార్మికవర్గ సమస్యలపై అలుపెరగని పోరు

1979 నుంచి ఇప్పటివరకు కార్మికుల సమస్యలపై వి.జి.కె అలుపెరుగని పోరాటం చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజలతో ఆయనకు విస్తృత సంబంధాలు ఉన్నాయన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. ప్రముఖ కవి, రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ క్రమశిక్షణ, కలుపుగోలుతనం మూర్తీ భవించిన వ్యక్తి వి.జి.కె మూర్తి అని కొనియాడారు. సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ, ప్రముఖ వైద్యులు పైడి మహేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, మోహనరావు, జె.వి.వి నాయకులు గొంటి గిరిధర్, ఎపిటిఎఫ్ నాయకులు కె.భానుమూర్తి, బిఇఎఫ్ఐ నాయకులు ఎం.శ్రీనివాసరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు కె.వేణుగోపాల్, ఎన్.ఈశ్వరరావు, ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి జామి భీమశంకరరావు, గాంధీమందిరం ప్రతినిధి ఎం.వి.ఎస్ శాస్త్రి తదితరులు వి.జి.కె మూర్తితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ మాట్లాడారు. అఖిల భారత ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులు కె.వేణుగోపాల్ పంపిన సంతాప సందేశాన్ని నాయకులు ఎం.వి కామేశ్వరరావు చదివి వినిపించారు. విజికె మూర్తి వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ ప్రజా కళాకారుడు రామచంద్రరావు గీతం ఆలపించారు. వి.జి.కె మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకుముందు వారంతా వి.జి.కె పార్థివ దేహంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



భౌతికకాయానికి నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

మున్సిపల్ హైస్కూల్‌లో హాల్‌కు విజికె పేరు

వి.జి.కె మూర్తి ఆకస్మిక మరణం చాలా బాధాకరమని, ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి అని ఎమ్మెల్యే గొండు శంకర్ కొనియాడారు. ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులుగా ఆ పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. పాఠశాలలోని తిలక్ హాల్‌ను పూర్తి చేయాలన్న ఆయన ఆశయాన్ని ఏడాదిలోగా పూర్తి చేసి, హాల్‌కు ఆయన పేరు పెడతామని ప్రకటించారు. మరణానంతరం తన శరీరాన్ని వైద్య కళాశాల ప్రయోగాలకు ఇవ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన చిరస్మరణీయుడుగా మిగిలిపోతారని కొనియాడారు. సంతాప సభ అనంతరం అంతిమయాత్ర ర్యాలీలో పార్థివదేహం వెంట వచ్చిన ఆయన రిమ్స్ వైద్య కళాశాలలో భౌతికకాయం అప్పగించే వరకు అక్కడే ఉన్నారు.

రిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత

మరణానంతరం తన భౌతికకాయాన్ని బోధన, పరిశోధన నిమిత్తం రిమ్స్ వైద్య కళాశాలకు ఇవ్వాలన్న ఆయన కోరిక మేరకు కుటుంబసభ్యులు భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు తరలించారు. పార్థివదేహం అక్కడికి చేరుకునేసరికి వి.జి.కె మూర్తి రెడ్ సెల్యూట్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం భౌతికకాయాన్ని రిమ్స్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా రిమ్స్ సూపరింటెండెంట్ షకీల మాట్లాడుతూ భౌతికకాయాన్ని వైద్య కళాశాల ప్రయోగాలకు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. మరణించిన తర్వాత కూడా సమాజం కోసం ఆలోచించడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భౌతికకాయాన్ని తమ ఇష్టపూర్వకంగా ఇచ్చేందుకు ముందుకొచ్చిన వి.జి.కె మూర్తి కుటుంబ సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. రిమ్స్ డైరెక్టర్ జి.వెంకటాచలం, ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం తదితరులు భౌతికకాయాన్ని కుటుంబసభ్యులు ఇష్టపూర్వకంగా అందిస్తున్నట్లు పత్రం తీసుకుని అనాటమీ విభాగానికి తరలించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం, సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు, నాయకులు ఎం.కృష్ణమూర్తి, ఎస్.సుధాకర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, వి.జి.కె మూర్తి కుమారుడు శ్రీనివాస కుమార్, కుమార్తెలు స్రవంతి, భారతి, కుటుంబ సభ్యులు కె.నాగమణి, పి.సుధాకరరావు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలో అంతిమ యాత్ర

సంతాప సభ అనంతరం శ్రీకాకుళం నగరంలో అంతిమ యాత్ర చేపట్టారు. కత్తెరవీధి నుంచి రిమ్స్ వైద్య కళాశాల వరకు ప్రదర్శన చేపట్టారు. జోహార్ వి.జి.కె మూర్తి, అమర్‌రహే వి.జి.కె అంటూ ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

బస్సులు కిటకిట

ప్రజాశక్తి - టెక్కలి

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చిన ప్రజలు పండగ అనంతరం తిరిగి తమ ప్రాంతాలకు వెళ్తుండడంతో ఆర్‌టిసి, ప్రైవేటు బస్సులు ప్రయాణికులతో కిటికిటలాడాయి. తిరుగు ప్రయాణాలు ప్రారంభం కావడంతో శుక్రవారం జనాలతో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రద్దీ నెలకొంది. సోమవారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నా, ఆదివారం రద్దీ ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో శుక్రవారం నుంచే తిరుగు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, పలాస, ఇచ్ఛాపురం వైపు వెళ్లే బస్సులు రద్దీగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలైన తెంబూరు, పాతపట్నం, పూండీ తదితర గ్రామాల వైపు వెళ్లే బస్సులు కూడా ప్రయాణికుల తాకిడి ఉంది. బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలూ ప్రయాణికులతో నిండాయి. ఇదే అదునుగా ప్రైవేటు బస్సులు టిక్కెట్ల ధరలు భారీగా పెంచారు.



పొందూరు : గోదాములో సరుకులను పరిశీలిస్తున్న సురేష్ కుమార్

నూతన గోదాముల నిర్మాణం

గిడ్డంగుల సంస్థ ఎమ్‌డి సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస, పొందూరు

రాష్ట్రంలో స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ ఆధ్వర్యాన ఉన్న గోదాములతో పాటు సామర్థ్యం పెంపు కోసం నూతన గోదాములు నిర్మించనున్నట్లు రాష్ట్ర గిడ్డంగులు, గోదాముల సంస్థ ఎమ్‌డి జి.సురేష్ కుమార్ అన్నారు. ఆమదాలవలస, పొందూరు మండల కేంద్రాల్లో స్టేట్ వేర్ హౌస్ గోదాములను శుక్రవారం పరిశీలించారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఎఫ్‌సి ద్వారా బియ్యం సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదాముల నిర్వహణ, కార్యాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గోదాముల సామర్థ్యంతో పాటు కోల్డ్ స్టోరేజీల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించనున్నట్ల తెలిపారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ వై.రాజశ్రీ, పొందూరు మేనేజర్ సునీత, గిడ్డంగుల సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 327 మంది అర్హత

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నిర్వహించిన దేహ దారుఢ్య పరీక్షల్లో 327 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు ఎస్‌పి మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన పురుష అభ్యర్థులకు పిఎంటి, పిఇటి పరీక్షలు, అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, బయోమెట్రిక్ తదితరమైనవి పరిశీలించారు.

శుక్రవారం 709 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 479 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఖైదీలకు మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - గార

జైల్లో ఖైదీలకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. మండలంలోని అంపోలులో గల జిల్లా జైలులో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి శుక్రవారం ఖైదీలకు న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ముందుగా జైలు పరిసరాలను పరిశీలించారు. జైల్లో తాగునీరు, వైద్యం తదితర అంశాలపై ఖైదీలతో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలమురళీకృష్ణ, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, డిఇఒ తిరుమల చైతన్య పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను గుర్తించాలి

- 27న సూర్య నమస్కారాలు
- 2, 3న క్రీడల నిర్వహణ
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామీణ క్రీడలను గుర్తించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈనెల 27వ తేదీన జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో సూర్య నమస్కారాలు చేయించాలన్నారు. రెండో తేదీన ఉదయం 8 గంటలకు సూర్య నమస్కారాలు 80 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్, వాలీబాల్, కబడ్డీ నిర్వహించాలని డిఎస్‌డిఒను ఆదేశించారు. గ్రామ స్థాయిలో క్రీడలను గుర్తించి తెలియజేయాలన్నారు. క్రీడలు 2, 3 తేదీల్లో ఉంటాయన్నారు. 80 అడుగుల రోడ్డులో రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు చూడాలని సంప్రదాయం స్కూల్ డైరెక్టర్ స్వాతీ సోమనాథ్‌కు సూచించారు. శోభాయాత్రకు పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఉద్యానవన శాఖ ఎడిని ఆదేశించారు. మూడో తేదీన లేజర్ షో, క్రేకర్ షో ఉంటాయని, హెలీకాప్టర్ టూరిజం, తదితరమైనవి ఉంటాయని వెల్లడించారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మిల్లు జంక్షన్ వరకే బస్సులు వస్తాయని డిఎస్‌పి వివేకానంద కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, డిటిసి విజయసారథి, అరసవల్లి ఆలయ ఇఒ భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

ఉపాధి కల్పనకు పిఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

యువతలో నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం పథకాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా పిఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంపై రూపొందించిన పోస్టర్‌ను జెడ్‌పి సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తోందని చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఎస్ఎస్‌సి, పాలిటెక్నిక్, ఐటిఐ, బిఎ, బిఎస్‌సి, బిఫార్మసీ, బిబిఎ, బిటెక్ వంటి డిగ్రీలు ఉన్న వారెవరైనా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులని స్పష్టం చేశారు. https://pminternship.mca.gov.in/login లింక్‌లో ఈనెల 21వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఈ ప్రోగ్రాంకు ఎంపికైన వారికి వన్ టైమ్ ఇన్సిడెంట్ గ్రాంట్ రూ.ఆరు వేలు, కేంద్ర ప్రభుత్వం ద్వారా నెలవారీ సహాయం రూ.4,500, పరిశ్రమల ద్వారా ఏడాది పాటు రూ.500 చొప్పున అభ్యర్థులకు ఆర్థికసాయం అందిస్తారని తెలిపారు. ఇంటర్న్‌షిప్‌లో చేరిన వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉందన్నారు. ఇప్పటికే ఉన్న పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పిఎం సురక్ష బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తారని తెలిపారు. డిఆర్‌డిఎ కాంప్లెక్స్‌లోని జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 9553228843, 8919366009 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ సిఇఒ శ్రీధర్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వికలాంగుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతి నెల మూడో శుక్రవారం నిర్వహించే స్వాభిమాన్‌లో భాగంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి కవితతో కలిసి వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ కౌంటర్ పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో డిపిఒ కె.భారతీసౌజన్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ, హౌసింగ్ పీడీ బి.నగేష్, ఎల్‌డిఎం ఎం.సూర్య కిరణ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాఖ ఉక్కుకు పూర్వవైభవం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీతో పూర్వ వైభవం వస్తుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విజయం కేవలం ఒక ఆర్థిక నిర్ణయం మాత్రమే కాదని, ఇది స్టీల్‌ప్లాంట్ కార్మికుల విజయమని తెలిపారు. రాష్ట్ర ప్రజల గర్వం, పట్టుదల, నిబద్ధత, శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో విశాఖ స్టీల్‌ప్లాంట్, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సమస్యలను పార్లమెంట్‌లో అవిశ్రాంతంగా లేవనెత్తినట్లు పేర్కొన్నారు. వారం వ్యవధిలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు ప్యాకేజీ వంటి రెండు ప్రధాన విజయాలను సాధించామని తెలిపారు. ఐకమత్యం, సకల్పంతో పోరాడిన ఈ విజయం తెలుగు వారికి సంక్రాంతి కానుకగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు జీవం : అచ్చెన్నాయుడు



కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం భారీ ప్యాకేజీ ప్రకటించి జీవం పోసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా నిలుపుదల చేయడమే కాకుండా, భారీ ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమన్నారు. రెండేళ్లలో విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



న్యాయవాదులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

రాజీ ద్వారా కేసుల పరిష్కారం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కక్షిదారులతో చర్చలు జరిపి రాజీమార్గం ద్వారా కేసులు, సమస్యలను పరిష్కరించుకోవాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జూనియర్ న్యాయమూర్తి బి.ఎంఆర్ ప్రసన్నలత అన్నారు. శుక్రవారం కోర్టు అవరణలో న్యాయవాదులు, కక్షిదారులతో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజీ ద్వారా కేసులు పరిష్క రించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని న్యాయవాదులు కక్షిదారులకు అర్థమయ్యేలా వివరిం చాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంతి సంతోషి, ఎజిపి ఎస్. తిరుమలరావు, న్యాయవాదులు లఖినేని శ్రీనివాస్, బి. నారా యణరావు, కవిటి మన్మథరావు, పూజారి వాసుదేవరావు తదితరులున్నారు.

రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రం పొందూరు పరిధిలో 188 సర్వే నెంబరులో ఉన్న సోషల్ క్లబ్‌ను కొంతమంది రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నిస్తున్నారని, దానికి సంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగకుండా నిలుపుదల చేయాలని స్థానిక సర్పంచ్ ఆర్.లక్ష్మి సబ్ రిజిస్ట్రార్ సంతోష్ కుమార్‌ను కోరారు. 60 ఏళ్లుగా పోస్టుమార్టం కేంద్రంగా, సోషల్‌క్లబ్ ఉన్న ఈ స్థలంలో తప్పుడు ధృవపత్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసేందుకు పొందూరుకు చెందిన ఎం.కృష్ణ ప్రయత్నిస్తున్నారని దీనిని నిలుపుదల చేయాలని వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఈ స్థలం కోర్టు వివాదంలో ఉందని, దీనిపై పంచాయతీతో పాటు పలువురు అధికారులకు నోటీసులు వచ్చాయని కోర్టు పరిధిలో ఉండగా రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సోషల్‌క్లబ్ నిర్వాహకులు క్లబ్ పేరుమీద పంచాయతీకి పన్నులు చెల్లించారన్నారు. దీనిపై పట్టణ ప్రజలు పోరాటానికి సిద్ధంగా ఉన్నారని సర్పంచ్ తెలిపారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ రాధాకృష్ణ

నిత్యన్నదానానికి రూ.2 లక్షలు వితరణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి సన్నిధిలో జరుగుతున్న నిత్యన్నదానానికి శ్రీకాకుళంకు చెందిన జి.వి.ఎస్.ఆర్ పట్నాయక్, లక్ష్మికుమారి దంపతులు శుక్రవారం రూ.2 లక్షల చెక్కును ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణకు ఆలయ ప్రాంగణంలో అందజేశారు. తన కుమారుడు అభిరామ్ పట్నాయక్ పుట్టినరోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానానికి ఈ మొత్తాన్ని ఇఒకు అందజేశారు.

నిర్మించారు .. వదిలేశారు

- ప్రారంభానికి ముందే శిథిలాలు
- రూ.కోట్లలో ప్రజాధనం వృథా

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో పలు గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు, సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో రాజుల సొమ్ము రాళ్ల పాలు అనే సామెతకు అతికినట్లుగా అధికారుల వ్యవహార శైలి ఉంది. కోట్ల రూపాయలు ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోలేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే పలు భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోకుండా శిథిలావస్థకు చేరాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిర్మాణాలు పూర్తయిన తర్వాత ప్రారంభించాలని ప్రజలు కోరినా అధికారుల నుంచి స్పందన లభించడం లేదు. ఈ విధంగా రాజుల సొమ్ము రాళ్ల పాలైనట్లు ప్రజాధనం ఈ విధంగా దుర్వినియోగం అవుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని హుదూద్ ఇళ్లు

దిష్టిబొమ్మలుగా హుదూద్ గృహాలు

మండలంలో సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురంలో 192 మంది లబ్ధిదారులకు అందించేందుకు రూ.746.15 లక్షల వ్యయం ప్రజాధనంతో నిర్మించిన హుదూద్ గృహాలు నేటికీ పంపిణీ కాకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కోట్ల రూపాయలు ప్రజాధనంతో నిర్మించి పట్టించుకోకుండా వదిలేశారని నిజంగా ప్రభుత్వాలకు, అధికారులకు చిత్తశుద్ధి ఉంటే పేదవారికి ఈ గృహాలు ఇచ్చి ఆదుకునేవారని మండల వాసులు గట్టిగానే విమర్శిస్తున్నారు. ప్రజాధనాన్ని అధిక మొత్తంలో వెచ్చించి నిర్మించిన గృహాలు ప్రయోజనం లేకుండా ప్రస్తుతానికి దిష్టిబొమ్మల్లా దుర్వినియోగంగా శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రజాధనంతో విలువైన గృహాలను నిర్మించి నిర్వీర్యం చేస్తూ ఇలా వదిలేయడం సరికాదని లబ్ధికారులకు ఇచ్చినట్లయితే ఎంతో మేలు చేకూరుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

శిథిలావస్థకు పశువుల ఆస్పత్రి

మనుషులకు అనారోగ్యం వస్తే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటారు. అలాగే పశువులకు అనారోగ్యం చేస్తే పశువుల వైద్యశాలకు తీసుకువెళ్లి చికిత్స చేస్తారు. కానీ, మండలంలో బోరుభద్ర పశువైద్యశాలకే అనారోగ్యం వస్తే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాలలోనే విధులు నిర్వహిస్తున్నారు అక్కడి పశువైద్యులు. ఇదంతా ఒక ఎత్తు అయితే రూ.ఆరు లక్షలు ప్రజాధనంతో కొన్నేళ్ల క్రితం నూతన పశువైద్యశాల ప్రారంభించినా నేటికీ పశువైద్యశాఖకు అప్పగించక, ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. ఇదీ



బోరుభద్రలో వృథాగా ఉన్న పశువైద్య భవనం

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రారంభం కాక శిథిలావస్థకు చేరుకుందని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. పూర్తిగా శిథిలమైన భవనంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ వృథా... అక్కడ వ్యథ అన్న సందంగా ఉంది.

అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని గోదలాం, దండుగోపాలపురం గ్రామాల్లో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన అంగన్వాడీ భవనాలు నిరుపయోగంగా మారాయి. గోదలంలో కొన్నేళ్ల క్రితమే నిర్మించిన అంగన్వాడీ భవనం ఇప్పటికీ ప్రారంభం కాక పశువుల శాలగా మారింది. కొన్నిచోట్ల భవనాలు లేక అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తుంటే గోదలంలో మాత్రం లక్షల రూపాయలు వెచ్చించి భవన నిర్మించారు. అధికారులు నిర్లక్ష్యంతో ప్రారంభం కాక శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు ఉండాల్సిన పరిస్థితి ఉంది. అలాగే దండుగోపాలపురంలో భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచి అసంపూర్తిగా ఉండటంతో చిన్నారులకు పాఠశాల వరండాలోనే ఉండాల్సిన దుస్థితి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో అంగన్వాడీ కేంద్రం అర్ధాంతరంగా నిలిచినా పట్టించుకునే నాథుడు లేరు. అలాగే మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్యాలయం పక్కన నిర్మించి ఉన్న భవనం ప్రారంభం కాక, నిరుపయోగంగా పడి ఉండడం గమనార్హం. పైన తెలిపినవి కొన్ని ఉదాహరణలు అయినా ఇంకా మండలంలో ఎన్నో ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. అయినా ఉన్నత అధికారులు పాలకులు పట్టించుకోని వాటిని వినియోగంలోకి తెప్పించాలని మండల వాసులు కోరుతున్నారు.



శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు చేస్తున్న యువకులు

యువత శ్రమదానం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దబొడ్డపాడు పంచాయతీ నారాయణపురంలో యువత శుక్రవారం శ్రమదానంతో గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న గుంతలను పూడ్చారు. పూండి- బెండిగేటు రహదారి నుంచి గ్రామం వరకు రహదారి పూర్తిగా శిథిమైంది. అభివృద్ధికి నోచుకోకపోవడంతో సంక్రాంతికి గ్రామానికి వచ్చిన యువత సుమారు 700 మీటర్ల మేర రహదారిని గ్రావెల్‌తో బాగు చేశారు. ఈ సందర్భంగా జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వేగులాడ దుర్గారావు రహదారిని పరిశీలించారు. తాను ఎమ్మెల్యే శిరీష, అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామానికి సిసి రహదారి మంజూరు చేసేందుకు కృషి చేస్తానని వారికి హామీఇచ్చారు. యువకుల భాగ్యరాజు, శ్రీను. శ్రావన్. దిలీప్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న గ్రామపెద్దలు

కార్యదర్శికి సన్మానం

పోలాకి: మండలంలో సంతలక్ష్మీపురం పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన చింతాడ మహేశ్వరరావును ప్రజలు, గ్రామపెద్దలు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకట రమణ మాట్లాడుతూ పంచాయతీలో ఏ సమస్య ఉన్నా చెప్పిన వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చేసేవారని, గ్రామకంఠ భూముల సర్వేలో ఎవరికీ ఏ సమస్యా లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యారబాటి నీలవేణి, ఎంపిడిఒ జి.రవి కుమార్, తాడేల మల్లేసు, సూరపు నాని, బి.రాంబాబు, పతివాడ వెంకటరమణ పాల్గొన్నారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ భద్రాజీ

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం: ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రధాత శ్రీ సూర్యనారాయణ స్వామిని శుక్రవారం తెలంగాణ హైకోర్టు జడ్జిలు టి.వినోద్ కుమార్, కె.లక్ష్మణ్, జె. శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి భద్రాజీ ప్రసాదాలను, స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. అడిషనల్ సబ్ జడ్జి యుగంధర్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ సన్యాసినాయుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



చేపడుతున్న రోడ్డు పనులు

శరవేగంగా స్టేషన్ అభివృద్ధి పనులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగు తున్నాయని జెడ్ఆర్‌యుసిసి సభ్యులు మోహన్ రంగా రౌల్ తెలిపారు. శుక్రవారం జరుగు తున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే ఇంజినీర్ అధికారులతో మాట్లా డుతూ అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ఫిబ్రవరి 1న వస్తున్న రైల్వే జనరల్ మేనేజర్ పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇంజినీర్ సూర్జీత్ మహంతి, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, భూమసేన్ పట్నాయక్, ప్రసాద్ పట్నాయక్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

పొందూరు: ఇంజనీరింగ్ విభాగంతో కలిసి పనిచేయడం ద్వారా ఉపాధి పనుల ప్రగతిలో మరింత ముందుకు వెళ్లవచ్చని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు అన్నారు. శుక్రవారం నందివాడలో పలు సిసి రహదారి పనులను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనులు మరింత వేగంగా జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మెటీరియల్ కాంపో నెంట్ నిధులతో చేపడుతున్న పనులు వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఇసి సందీప్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సినీ హీరోల సందడి

ఆమదాలవలస: మండలంలోని కోర్లకోటకు చెందిన పేడాడ నరసింగరావు, రమణికుమారి విశాఖపట్నంలో స్థిరపడ్డారు. శుక్రవారం వారి కుమారులు సందీప్, సరోజ్ సినీహీరోలు. తాతగారి ఊరైన కోర్లకోటకు వచ్చి సందడి చేశారు. ఇటీవల విడుదలైన రోటి కపడా రొమాన్స్ కమిటీ కుర్రాళ్లు సినిమాల్లో వీరు నటించారు. అలాగే మినుగురులు సినిమాలో నటించినందుకు దీపక్, సరోజ్‌కు నంది అవార్డు వరించింది. సిద్దార్థ రాయ్ సినిమాలో కూడా ఇటీవల నటించారు.



విప్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చెరువు మరమ్మతులు చేపట్టాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 11వ వార్డులో ఉంటున్న కృష్ణాసాగర్ చెరువు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్‌కు రైతులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం ప్రభుత్వ విప్ క్యాంపు కార్యాలయంలో స్వయంగా కలిసిన రైతులు తమ గోడును వివరించారు. చెరువు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండి నిరుపయోగంగా మారిందన్నారు. కృష్ణసాగర్ చెరువును తక్షణమే మరమ్మతులు చేయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆసీ లీలారాణి, ఎల్.తరణిరావు, లంకా దండసి, భాస్కరరావు, మోహనరావు, కూర్మారావు, యోగేష్, ఉమా పతి, ముకుంధరావు పాల్గొన్నారు.

తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద పద్మాపురానికి చెందిన దుబ్బ భాస్కరరావు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 21న విజయవాడలోని శ్రీ కౌత పూర్ణచంద్ర విలాస్ కళావేదికలో ఈయనకు సన్మానంతో పాటు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభ అవార్డు ప్రదానం చేయనున్నారు.

ఘనంగా వల్లభనారాయణస్వామి జాతర

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రతిఒక్కరూ ఐకమత్యంతో మెలగాలని అప్పుడే గ్రామాలను కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోగలమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం నైరాలో వల్లభ నారాయణస్వామి రథయాత్ర మహోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే శుక్రవారం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీసభ్యులు ఎమ్మెల్యేకు దుశ్శాలువతో సత్కరించి మెమెంటోను అందజేశారు.వీ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో గ్రామాల్లో మరలా అభివృద్ధి పనులు జరగనున్నాయన్నారు. గత ప్రభుత్వంలో కనీసం బ్లీచింగ్ కొనే పరిస్థితి కూడా ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖపై ప్రత్యేకంగా దృష్టి సారించి కేంద్రం నుంచి నిధులను తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధికి స్వీకారం చుట్టారన్నారు. గ్రామస్తులంతా ఈ రథయాత్ర ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు.



కోటబొమ్మాళి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కోటబొమ్మాళి: ప్రతినెల మూడవ శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశం మందిరంలో కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డు అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల మూడవ శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్‌ను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ, తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ జి. హరిప్రసాద్, టిసి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ్ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు టెక్కలి పాత జిల్లా ఆస్పత్రిలో కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత పరశురాంపురం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పరశురాంపురంలో శుక్రవారం క్రికెట్ ఫైనల్ టోర్నమెంట్‌లో తోవూరు జెండర్స్‌పై పరశురాంపురం లెజెండ్‌లు పాల్గొనగా పరశురాంపురం విజయం సాధించింది. ప్రథమ స్థానంలో నిలిచిన పరశురాంపురం లెజెండ్‌కు రూ.10వేలు నగదు బహుమతిని, ద్వితీయ స్థానంలో నిలిచిన తోవూరు జెండర్స్‌కు రూ.8 వేలు నగదు బహుమతి, మెమొంటోలను స్థానిక సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటి, పవన్, అరుణ్, చంటి, కళ్యాణ్, రాజు, విశ్వనాథ్, సురేష్, మన్మథ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సురంగిరాజ వారి మైదానంలో సంక్రాంతి సందర్భంగా ఐసిసి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా నర్సింగరావు, భానుమతి స్మారక ప్రీమియర్



మెళియాపుట్టి : బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ ప్రసాదరావు

లీగ్ అండర్-12, 14 సీజన్-2 రసవత్తరంగా జరిగాయి. ఈ టోర్నీ ఫైనల్‌లో బ్లూ డైమండ్ విజేత్‌గా నిలిచింది. ఫైనల్ మ్యాచ్ కిడ్స్ స్టార్స్, బ్లూ డైమండ్స్ మధ్య జరిగింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా క్రికెట్ సంఘం చీఫ్ కోచ్ సుదర్శన్, విశిష్ట అతిథిగా భత్తుల వెంకటరమణ, చాట్ల తిరుపతి రెడ్డి, రంగాల రాజు, పి.స్నేహలత తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆత్మీయంగా.. ఆహ్లాదంగా...



పొందూరు : విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- కవిటి

గత 25 ఏళ్లుగా కవిటి బ్యాడ్మింటన్ క్రీడాకారులు జరుపుకుంటున్న విహార యాత్రకు కవిటి సముద్ర తీరం వేదికైంది. ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో పాటు జనసేన నాయకుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ సహా మిత్రబృందం పాల్గొన్న ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా జరిగింది. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ ఆత్మీయ కలయికలో అందరూ ఆడారు, పాడారు. ఆత్మీయతలు పంచుకున్నారు. ఈ కలయికలో జెడ్‌పిటిసి మాజీసభ్యుడు బెందాళం రమేష్, బెందాళం చిట్టిబాబు, పిరియా కల్యాణ్, పాండవ చంద్రశేఖర్, తమరాల జయరాం, ప్రగడ మణిబాబు, బల్లెడ రమేష్ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-1999 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను, మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించారు.

వజ్రపుకొత్తూరు: మండలంలో నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాల అవరణంలో అత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులంతా అపూర్వంగా కలుసుకొని ఒకరినొకరు అత్మీయంగా పలకరిం చుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను పంచుకుంటూ సందడి చేశారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు ఘనంగా సన్మానం చేశారు. అలాగే అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



కవిటి : ఆత్మీయ కలయికలో స్నేహితులు

కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులున్నారు.


కొత్తూరు: మండలంలోని కడుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొర్లె తిరుమలరావు అధ్యక్షతన 1995-99 పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థు లంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉల్లాసభరితంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, సర్పంచ్, ఎంపిటిసి, పాఠశాల యాజ మాన్య కమిటీ, మాజీ సర్పంచ్‌ను సన్మా నించారు. పూర్వ విద్యార్థులు గోవింద రావు, జగదీశ్వరరావు, శేషగిరిరావు, అచ్యుతరావు, ఫాల్గుణరావు, గోపాల్, మాలతి, సుహాసిని పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మెనూ ప్రకారం విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ రామారావు, ఎంఇఒలు అప్పారావు, విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం ఎంఇఒ కార్యాలయంలో స్కూల్‌కాంప్లెక్స్‌ల వారీగా హెచ్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని హెచ్ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రాప్తికి ఏ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఏయే పాఠశాలలు ఏ విధంగా ప్రతిపాదనలు చేయాలో సూచించారు. వాటిని ఎస్ఎంసి సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడి వారి తీర్మానం తీసుకొని ఫైనల్ చేయడం జరుగుతుందన్నారు.

సింగన్నపాలెంలో సంక్రాంతి సంబరాలు



బహుమతులు అందజేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని సింగన్నపాలెంలో సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కొల్ల వికాస్, పొగిరి ప్రకాష్, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రథమ స్థానంలో నిలిచిన కొల్ల ధరణి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రథమస్థానంలో నిలిచిన తులగాపు పరిమళ, ద్వితీయ స్థానంలో నిలిచిన గేదెల రమాక్రాంతిలకు కొల్ల జయరాం, నీటి సంఘం అధ్యక్షుడు టంకాల శ్రీనివాస్ ఆర్థికసాయంతో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం గేదెల ముఖలింగం, జనసేన పార్టీ బూర్జ మండలం ప్రధాన కార్యదర్శి తులగాపు మౌలి, రుంకు నీలం నాయుడు, ధన్నాన వెంకటరావు, టంకాల రామకృష్ణ, సైరిగాపు సురేష్, గిడిజల లింగం నాయుడు, రాంబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సముద్ర స్నానానికి వెళ్లి యువకుడు గల్లంతు

- ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు, మెరైన్ పోలీసులు
- పండగపూట వజ్రపుకొత్తూరులో విషాదం



తరుణ్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలం వజ్రపు కొత్తూరుకు చెందిన జంగం తరుణ్ (16) అనే యువకుడు సముద్రంలో స్నానానికి దిగి రాకాసి అలలతాకిడికి కొట్టుకుపోయాడు. యువకుడు ఆచూకీ కోసం గ్రామస్తులతో పాటు పోలీసులు, మెరైన్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగం తరుణ్ కాశీబుగ్గలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదవుతున్నాడు. కళాశాలలకు సెలవులు కావడంతో సంక్రాంతికి గ్రామానికి వచ్చిన మిత్రులతో కలిసి శుక్రవారం ఉదయం వజ్రపుకొత్తూరు తీరంలో గల సముద్రస్నానానికి వెళ్ళాడు. తోటి స్నేహితులతో కలిసి సముద్రంలో దిగి స్నానం చేస్తున్న క్రమంలో రాకాసి అల ఒక్కసారిగా రావడంతో సముద్రంలో కొట్టుకుపోయాడు. దీంతో ఆందోళన చెందిన మిత్రులు రక్షించేందుకు ప్రయత్నం చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. విషయం గ్రామస్తులకు చేరవేయడంతో వారు తీరానికి చేరుకుని స్థానిక మత్స్యకారుల సహాయంతో సముద్రంలో తీవ్రంగా గాలించారు. విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు పోలీసులు, బావనపాడు మెరైన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలించారు. అయినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. అక్కడే ఉన్న తరుణ్ మిత్రుల నుంచి వివరాలు సేకరించారు. కాగా జంగం హేమంత్, తులసీ దంపతులకు ఇద్దరు కమారులు కాగా తరుణ్ రెండో కుమారుడు. తండ్రి హేమంత్, పెద్దకుమారుడు శివ ప్రైవేటుగా చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. తరుణ్‌ను ఎలాగైనా బాగా చదివించాలని కలలు కన్నారు. ఇంతలో ఈ సంఘటన చోటుచేసుకోవడంతో కుటుంబ రోధన చూపరులకు కంటతడి పెట్టిస్తుంది. పండగ వేడుకుల్లో గ్రామస్తులు ఉండగా ఈ సమయంలో తరుణ్ గల్లంతు సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బూర్జ

మండలం తడ్డలి గ్రామ జంక్షన్ వద్ద ఈ నెల 1న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన తుడ్డలి గ్రామానికి చెందిన రాగాన సూరయ్య(64) శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు ఈ నెల 1న శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం సైకిల్‌తో తుడ్డలి గ్రామానికి వెళ్తున్న సూరయ్యను బలంగా ఢీకొనడంతో మెడ పైభాగం గాయం కావడంతో వెంటనే స్థానికులు పాలకొండ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యంకోసం విశాఖపట్నం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు భార్య నరసమ్మ తెలియజేసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. సూరయ్య కూలిపని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోయామని భార్య, ముగ్గురు కుమారులు బోరున విలపిస్తున్నారు.



బంగారం చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధి ఎచ్చెర్లలో రామాలయం వీధిలో పుల్లూరు వెంకటరమణ తన ఇంట్లో రెండు తులాల బంగారం కనిపించడం లేదని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల మేరకు వెంకటరమణ గతేడాది నవంబర్‌లో బీరువాలో దాచి ఉంచాని, ఈనెల 13న బీరువా తెరిచేసరికి బంగారు వస్తువులు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రమణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ఎచ్చెర్ల: మండలం షేర్ మహమ్మద్ పురం పంచాయతీ లింగాలపేట గ్రామానికి చెందిన సూర్యనారాయణను 8 మద్యం సీసాలతో పట్టుకున్నారు. పోలీసుల వివరాల మేరకు సూర్యనారాయణ మద్యం అమ్మకం జరుపుతున్నట్టు తెలియడంతో పోలీసులు నిఘా పెట్టి తనిఖీలు చేయగా సూర్యనారాయణ తన ఇంటి వెనుక మద్యం అమ్మకం చేస్తుండగా పట్టుకున్నామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సూర్యనారాయణను అరెస్టు చేసి కేసు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

పొందూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని ఎస్ఐ వి.సత్య నారాయణ పేర్కొన్నారు. మండలం రాపాక కూడలి వద్ద శుక్రవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగించని వాహన దారులకు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

ఎపిఎం కృషి అభినందనీయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వెలుగు ఎపిఎం గొడబ ప్రసాదరావు కృషి అభినందనీయమని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం డిఆర్‌డిఎ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పీడీ చేతులమీదుగా ప్రసాదరావుకు ప్రశంసాపత్రం అందజేశారు. సిక్కోలు డ్వాక్రా బజారుకు వజ్రపుకొత్తూరు మండలం మహిళా సంఘాల ఉత్పత్తులు సమీకరించి మహిళల జీవనోపాధులను ప్రోత్సహించే విధంగా ఎపిఎం కృషి చేయడం అభినందనీయమన్నారు. మహిళలు తయారు చేసిన డ్వాక్రా ఉత్పత్తులకు సిక్కోలు డ్వాక్రా బజారులో పెట్టి అమ్మకాలు జరిపి వారిని గుర్తింపు లభించేలా చేశారని ఆయన అన్నారు. ఇటువంటి ప్రోత్సాహం వలన మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగి సొంత వ్యాపారాలు వైపు అడుగులు పడతాయన్నారు. కార్యక్రమంలో డిపిఎం హెచ్ నారాయణరావు, ఎపిడి సన్యాసి రాజు, ఎసిలు పాల్గొన్నారు.



ఎపిఎంను అభినందిస్తున్న పీడీ కిరణ్‌కుమార్